సాక్షి
విజయనగరం
శుక్రవారం । 24 । మార్చి । 2023



ప్రాణ క్షయం
క్షయ వ్యాధి ఒకప్పుడు సమాజాన్ని పట్టిపీడించేది. ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల వ్యాధి కాలక్రమేణా అదుపులోకి వస్తోంది. - 8లో



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి
యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ఎన్ఫోర్స్మెంట్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎఎస్పీ) ఆస్మాఫర్హీన్ సూచించారు. - 8లో

తాగునీటి సమస్యలపై మానటరింగ్ సెల్
విజయనగరం ఫోర్ట్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం తమ కార్యాలయంలో మానటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.ఉమాశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య 91001 20711 నంబరుకు ఫోన్ చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.



మామిడి రైతులకు తీపి కబురు

మామిడి దిగుబడులు ఒకే చోటకు చేర్చి ధర వచ్చేటప్పుడు విక్రయించుకునేలా చేసేందుకు మామిడి సేకరణ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఇప్పటికే నాలుగు చోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి. 16 నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి ద్వారా ఉద్యానవన పంటల రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్ణయించింది.



- జిల్లాలో 20 మామిడి సేకరణ కేంద్రాలు
- ఒక్కో కేంద్రానికి రూ.15లక్షలు
- రూ.11.25 లక్షల ప్రభుత్వం రాయితీ
- రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యం
- దళారీ వ్యవస్థకు చెక్

జామి: ఉద్యానవన పంటలు పండించే రైతులకు ప్రయోజనం చేకూర్చడంతో పాటు దళారీ వ్యవస్థకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాయితీల వరాలు కురిపించి ఉద్యానవన రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా మామిడి రైతులను ఆదుకునే విధంగా మామిడి సేకరణ కేంద్రాల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మామిడి రైతులు దళారీల బారిన పడకుండా రైతులకు నష్టం వాటిల్లకుండా ఈ సెంటర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ రాయితీ రూ.11.25 లక్షలు
జిల్లాలో ప్రభుత్వం 20 మామిడి సేకరణ కేంద్రాలు మంజూరు చేసింది. వాటిలో నాలుగు కేంద్రాల నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో 16 కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో ఎంసీసీ నిర్మాణానికి రూ.15 లక్షల వ్యయం కానుంది. ఇందులో ప్రభుత్వం రాయితీ రూ.11.25 లక్షలు మంజూరు చేస్తుంది. ఎఫ్పీఓ వాటా రూ.3.75 లక్షలు మామిడి రైతులు చెల్లించాలి. మామిడి రైతులు ఉద్యానవన శాఖ ద్వారా గుర్తింపు పత్రం తీసుకుని, 100మంది రైతులు కలిసి ఒక సంఘంగా ఏర్పాటు కావాలి. అటువంటి ఒక సంఘానికి ఒక ఎంసీసీ మంజూరు చేస్తారు.

ఎంసీసీలతో ప్రయోజనాలు
రైతులు, కౌలు రైతులు తాము పండించిన పంటను ఎంసీసీల వద్దకు తరలించి, నిల్వ చేసుకుని మామిడి అమ్మకాలు సాగించవచ్చు. రైతులు తమ పంటను ఒకే కేంద్రం వద్దకు తరలిస్తే ముఖ్యంగా రైతులకు మంచి ధర వస్తుంది, కేంద్రం వద్ద గ్రేడ్లు వారీగా విభజించి గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా విక్రయాలు జరపవచ్చు. గతంలో రైతులు సొంతంగా అమ్మకాలు సాగిస్తే దళారులు తమకు నచ్చిన ధరకు తీసుకునే వారు. దీంతో మామిడి రైతులు నష్టపోయేవారు. ఎంసీసీల ద్వారా అమ్మకాలు సాగిస్తే అందరికి ఒకే రకమైన ధర వస్తుంది. ముఖ్యంగా దళారుల బెడద ఉండదు. మామిడి పంటనే కాక ఉద్యానవన పంటలు, కూరగాయలు కూడా అమ్మకాలు చేయవచ్చు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఎంసీసీల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా దళారులను నియంత్రించడానికి ఈ సేకరణ కేంద్రాలు ఉపకరిస్తాయి.

రెండు జిల్లాల రైతులకు..
లొట్లపల్లి పంచాయతీలో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రం విజయగనరం, విశాఖ జిల్లాలకు చెందిన సుమారు ఐదు వేల మంది మామిడి రైతులు వినియోగించుకోనున్నారు. విజయగనరం జిల్లాలో జామి, ఎస్.కోట, కొత్తవలస, వేపాడ, ఎల్.కోట, గంట్యాడ, విజయగనరం తదితర మండలాలు, విశాఖపట్నం జిల్లాకు చెందిన పద్మనాభం, ఆనందపురం, పెందుర్తి, కోటపాడు తదితర మండలాలకు చెందిన రైతులకు లొట్లపల్లిలోని మామిడి సేకరణ కేంద్రం వినియోగపడనుంది.



విక్రయాలకు సిద్ధంగా ఉన్న మామిడి బుట్టలు, (ఇన్సెట్లో) లొట్లపల్లిలో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రం

30,720 హెక్టార్లలో సాగు
జిల్లాలో మామిడి పంటను 30,720 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వం ఉద్యానవన శాఖకు అందిస్తున్న ప్రోత్సాహంతో సుమారు 400 హెక్టార్లలో మామిడి సాగును విస్తరించారు. జిల్లాలో ఏడాదికి సరాసరి 3,07,200 మెట్రిక్ టన్నులు మామిడి దిగుబడులు సాధిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పండించిన మామిడి ఉత్పత్తులు రాయపూర్, బరంపురం, కోల్కత్తా, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



మామిడి సేకరణ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు ఇది ఉపయోగకరం. ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్మాణాలకు 75శాతం రాయితీ అందిస్తుంది. ఒక్క మామిడి కాకుండా ఇతరత్రా ఉద్యానవన పంటలను కూడా విక్రయించుకోవచ్చు. రైతులు పండించిన పంటను ఈ కేంద్రాలకు తీసుకువచ్చి అమ్మకాలు చేసుకోవచ్చు. జిల్లాలో మొత్తం 23 మామిడి సేకరణ కేంద్రాలు మంజూరయ్యాయి. ఏప్రిల్ చివరికి మొత్తం నిర్మాణాలు పూర్తవుతాయి. జిల్లాలో ఎవరైన గ్రూప్గా ఏర్పాడి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం.
– ఏవీఎస్వీ జమదగ్ని, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

ఎంతో ప్రయోజనం



మామిడి సేకరణ కేంద్రాలు మామిడి రైతులకు ఎంతో ప్రయోజనం. గతంలో చిన్న చిన్న పాకల్లో మామిడిని ఉంచే వారం. ప్రస్తుతం ఈ కలెక్షన్ సెంటర్లో పండించిన పంటను ఉంచి విక్రయాలు చేసుకునే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఈ నిర్మాణానికి అత్యధికంగా 75శాతం రాయితీ అందిస్తుంది. జామి మండలం లొట్లపల్లిలో సెంటర్కు విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన రైతులు పండించిన మామిడి పంటలను తీసుకువస్తారు.
– లగుడు దేముడు, మామిడి ఉత్పత్తుల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్బాగ్: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6, ఇంటర్లో ప్రవేశం కోసం, అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి గానూ ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనాథలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును హెచ్ టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్ సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన సందేహాలు ఏమైనా ఉంటే 90002 04925 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సుధారాణి



విజయనగరం టౌన్: జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా ఎం.సుధారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్చార్జి ఈడీగా విధులు నిర్వహించిన పద్మావతి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో తహసీల్దార్గా విధులు నిర్వహించారు. తాజాగా నందిగామ మండల తహసీల్దార్గా పని చేస్తూ, డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతి పొంది, జిల్లాకు ఈడీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమృత్ జలధార పథకం కింద షెడ్యూల్ కులాలకు చెందిన రైతుల భూములకు నీటి వసతి కల్పించేందుకు ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని, అదేవిధంగా యంగ్ ఎంటర్ ప్రెన్యూర్ పథకం స్వయం ఉపాధి కింద ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, వేర్ హౌస్, గోదాముల నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేసేందుకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు.

న్యూస్రీల్

న్యాయవాదుల సంఘం జిల్లా మహాసభలు రేపు



కండాపు ప్రసాదరావు

బొబ్బిలి: పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు నిర్వహించే న్యాయవాదుల సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని న్యాయవాది కండాపు ప్రసాదరావు కోరారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలకు ప్రముఖ న్యాయమూర్తి ఉంగట్ల సత్యారావు, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేఎస్ సురేష్ కుమార్ హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని న్యాయవాదులంతా మహాసభలకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

వృత్తిపై అంకితభావం అవసరం

- డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి



మూమెంట్ పత్రాలు అందుకున్న వైద్యులతో డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి పేర్కొన్నారు . జిల్లాలో కొత్తగా మంజూరైన సీహెచ్సీ అనుబంధ పీహెచ్సీలకు నియమితులైన వైద్యులకు మూమెంట్ ఆర్డర్స్ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని తెలిపారు. వైద్యులు దేవుడితో సమానమని రోగులు నమ్ముతారని చెప్పారు. రోగులకు ప్రేమతో వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వప్నలత

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎన్ఆర్సీ న్యూట్రీషియనిస్ట్ స్వప్నలత అన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక దాసన్నపేట హైస్కూల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చోడి, కొర్ర, సామల మొదలైన చిరుధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని తీసుకుంటే ఆడపిల్లలు శారీరకంగా ధృడంగా ఉంటారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే చైల్డ్లైన్ 1098కుగాని, పోలీసులకుగాని సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ జి.ప్రసన్న, ఐసీడీఎస్ సూపర్వైజర్లు గనివాడ ఎర్రయ్యమ్మ, మేరీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి కల్యాణానికి పవిత్ర గోటి తలంబ్రాలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈ నెల 30న జరగబోయే శ్రీరామనవమి కల్యాణానికి గోటితో తొలచిన కోటి తలంబ్రాలు సిద్ధమయ్యాయి. రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో సిద్ధం చేసిన గోటి తలంబ్రాలను 2017 నుంచి శ్రీరాముడి కల్యాణానికి అర్చకులు వినియోగిస్తున్నారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు ప్రత్యేకంగా సేద్యం చేసిన ధాన్యాన్ని గోటితో తొలిచి తలంబ్రాలుగా మార్చారు. సిద్ధం చేసిన తలంబ్రాలను రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులకు రామ భక్తులు పంపించారు. పవిత్ర తలంబ్రాలను శ్రీరామనవమి రోజున నిర్వహించబోయే స్వామి కల్యాణంలో తలంబ్రాల సేవకు అర్చకులు వినియోగిస్తారని విజయ్కుమార్ తెలిపారు.

ప్రజా భాగస్వామ్యంతోనే క్షయ నివారణ

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామేశ్వరి ప్రభు

విజయనగరం ఫోర్ట్: ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ వ్యాధిని నియంత్రించడం సాధ్యపడుతుందని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు అన్నారు. జిల్లా క్షయ నివారణ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, బస్స్టేషన్లు తదితర చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్షయ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో విరివిగా అవగాహన కల్పించామని చెప్పారు. 2025 నాటికి క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తీసుకుంటున్న చర్యలు ఫలితంగా జిల్లాలో క్షయ వ్యాధి వ్యాప్తి తగ్గుతుందన్నారు. జిల్లాలో గత నాలుగేళ్లుగా క్షయ వ్యాధి 20 శాతం మేర తగ్గిందన్నారు. ప్రతి పీహెచ్సీ పరిధిలో ఒక నోడల్ అధికారిని, అవసరమైన మేరకు మందులను అందుబాటులో ఉంచామని తెలిపారు. క్షయ రోగుల్లో మనో ధైర్యాన్ని నింపుతున్నామని తెలిపారు. 64 మంది క్షయ మిత్రల సహాయంతో 518 క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నామని తెలిపారు. వారికి మందులు, ఉచిత ఆహార కిట్లును అందిస్తున్నామన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం పట్టణంలో అవగాహన ర్యాలీతో పాటు సంతపేట యూపీహెచ్సీలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస పత్రాలను అందజేస్తామన్నారు.

నాక్ అక్రిడేషన్ తప్పనిసరి

- ఉన్నత విద్య కళాశాలలకు..
- ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రామమోహన్రావు
- జేఎన్టీయూ జీవీలో నాక్ అక్రిడేషన్ సదస్సు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని ప్రతి ఉన్నత విద్యా కళాశాల నాక్ అక్రిడేషన్ స్థాయిని చేరుకోవాలని ఆ దిశగా కళాశాలలను తీర్చిదిద్దాలని ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన్రావు అన్నారు. స్థానిక జెఎన్టీయూ గురుజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో గురువారం యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు నిర్వహించిన 'నాక్ అక్రిడేషన్ ' సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పెట్టుకున్న లక్ష్య సాధనలో భాగంగా తొలిత ప్రతి కళాశాల నాక్ అక్రిడేషన్ అర్హతను సాధించే దిశగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలలకు అన్ని సౌకర్యాలు మరియు కావాల్సిన క్వాలిటీ ప్రమాణాలను సమకూర్చుకోవాలని 2021 ఫిబ్రవరిలోనే మూడేళ్ల పాటు సమయం ఇస్తూ జీఓ ఇచ్చారని అన్నారు. నాక్ అక్రిడేషన్ అర్హత సాధించడం వల్ల విద్యా సంస్థలకు ప్రపంచ స్థాయి గుర్తింపు రావటంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు దండిగా మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 నెలల ఇంటర్న్షిప్, నాక్ అక్రిడేషన్ వల్ల విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందడానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, వివిధ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్స్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్స్ వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి హాజరయ్యారు.



ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రామమోహన్రావును సత్కరిస్తున్న చిత్రం

తెల్లారిన బతుకులు

- మూడంతస్తుల భవనం కూలిపోవడంతో అన్నాచెల్లెళ్ల మృతి



తల్లిదండ్రులతో దుర్గాప్రసాద్, అంజలి(ఫైల్)

దాబాగార్డెన్స్/మెరకముడిదాం: జీవీఎంసీ 29వ వార్డు పరిధి రామజోగిపేటలో ఒమ్మి అప్పారావుకు చెందిన రెండంతస్తుల ఇల్లు ఉంది. గ్రౌండ్ ఫ్లోర్లో బిహార్కు చెందిన రామ్విలాస్(చోటు) అద్దెకు ఉంటూ జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద నూడిల్స్ దుకాణంలో పని చేస్తున్నాడు. వారం రోజుల కిందట విజయవాడ కృష్ణలంకకు చెందిన కొమ్మిశెట్టి శివశంకర్ అతడు పనిచేస్తున్న నూడిల్స్ పాయింట్ వద్దే పనికి చేరాడు. చోటు వద్దనే శివశంకర్ కూడా ఉంటున్నాడు. అదే ఇంటి మొదటి అంతస్తులో విజయనగరం జిల్లా మెరకముడిదం మండలం గొల్లల మర్రివలసకు చెందిన సాకేటి రామారావు, భార్య సాకేటి కల్యాణి, కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె అంజలితో నివాసం ఉంటున్నాడు. ఈ కుటుంబం పదిహేనేళ్లుగా విశాఖలో నివాసం ఉంటోంది. రామారావు ప్రైవేట్ పనులు చేసుకుంటుండగా, అతని భార్య నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్గా పని చేస్తోంది. కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్తె అంజలి వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలు రాయనుంది. రెండో ఫ్లోర్లో పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగికి చెందిన సన్నాపు కృష్ణ, భార్య రోజారాణి నివాసం ఉంటున్నారు. వీరు కూడా ఎనిమిదేళ్ల కిందట వలస వచ్చారు. కృష్ణ దండుబజార్ సమీపంలోని ఓ కేటరింగ్ వద్ద డ్రైవర్గా పనిచేస్తుండగా.. అతని భార్య కూడా నగరంలోని ఓ ఆస్పత్రిలో నర్స్గా పనిచేస్తోంది.

అసలేం జరిగిందంటే..
బుధవారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్లో అద్దెకు ఉంటున్న రామ్విలాస్ అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. మరో అరగంటకి కొమ్మిశెట్టి శివశంకర్ వచ్చాడు. అప్పటికే సాకేటి రామారావు కుటుంబం, సన్నాపు కృష్ణ కుటుంబం గాఢ నిద్రలోకి జారుకున్నారు. సమయం ఒంట గంట అయింది. కింది ఫ్లోర్లో బిహార్కు చెందిన చోటు తన సెల్ ఫోన్ చూసుకుంటూ సేదదీరుతున్నాడు. సహచరుడు శివశంకర్ బాత్రూమ్కి వెళ్లాడు. ఉన్నట్టుగా ఏదో కదులుతున్నట్టు అనిపించడంతో అతను రూమ్ నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే పై రెండు ఫ్లోర్లు కూలుతూ కిందకు పడిపోతుండడాన్ని గమనించి బయటకు పరుగులు పెట్టేలోపే మొత్తం ఇళ్లంతా కూలిపోయింది. ఈ ఘటనలో గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న రామ్విలాస్(30), మొదటి అంతస్తులో ఉంటున్న దుర్గాప్రసాద్(17), అంజలి(15) మృతి చెందారు. శివశంకర్, సాకేటి రామారావు, సాకేటి కల్యాణి, సన్నాపు కృష్ణ, రోజారాణి గాయాలతో బయటపడ్డారు. వీరిలో కల్యాణి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా కేజీహెచ్లోనే చికిత్స పొందుతున్నారు.



మృతి చెందిన దుర్గాప్రసాద్




అంజలి మృతదేహం

సహాయక చర్యలు ముమ్మరం
సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తుల శాఖ, రెవెన్యూ, పోలీసు, ఫైర్ విభాగాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గురువారం వేకువజాము 2 గంటల నుంచి 7 గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. శిథిలాల కింద కూరుకుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. మృతి చెందిన అంజలి, దుర్గాప్రసాద్, రామ్విలాస్ను అతి కష్టంపై తీయగలిగారు. క్షతగాత్రులను 108లో కేజీహెచ్కు తరలించారు. ఈ ఘటనపై మహారాణిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు, నిపుణులతో దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వరాల వసంతం.. రంజాన్ మాసం

- నెలరోజులు కఠోర దీక్షలు, దానధర్మాలు
- పాపాల నుంచి రక్షించుకునే అవకాశం
- నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం



విజయనగరం టౌన్: యావత్తు ప్రపంచంలో ఉన్న ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్. ఈ నెల అరబీ నెలల వరుస క్రమంలో 9వ నెలగా గుర్తించబడుతుంది. రంజాన్ అంటే 'కాలిపోవడం, భస్మీపటలమవ్వడం, ఆగిపోవడం' అనే అర్థాలను సూచిస్తుంది. రంజాన్ నెలలో ఒక ముస్లిం తన పాపాలు, పొరపాట్లు, తప్పిదాలన్నీ కాలిపోయి వాటికి బదులుగా పుణ్యఫలాలు లభిస్తాయని అర్థం. ఈ సుఖాల సరోవరం, వరాల వసంతం అయిన రంజాన్ మాసం నెలవంకను చూసిన వెంటనే ప్రారంభమవుతుంది. ఈ నెల 24 శుక్రవారం నుంచి ఏప్రిల్ 21 వరకూ రంజాన్ మాసంగా పేర్కొంటూ ముస్లిం మతపెద్దలు నిర్ణయించారు. ఈ నెలకు అల్లాహ్ దృష్టిలో పవిత్రమైన, ప్రత్యేకమైన స్థానముంది. విశ్వాసులకు ఎనలేని సంతోషాలను, పుణ్యాలను అందిస్తుంది ఈ మాసం. ఏడాది మొత్తం ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు చిన్న పిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకూ ఈ పవిత్ర మాసం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటారు.

ఈ నెల ప్రత్యేకతలు

- 30 రోజుల పాటు ప్రపంచంలో ముస్లింలందరూ ఉపవాస దీక్షలు పాటిస్తారు.
- మానవుల మార్గదర్శక గ్రంథం, చివరి దైవ గ్రంథం దివ్యఖురాన్ అవతరించింది ఈ నెలలోనే. దీనికి కృతజ్ఞతగానే ముస్లింలు ఉపవాసాలు పాటిస్తారు.
- ఈ నెలలో చేసే ప్రతీ చిన్న పుణ్యకార్యానికి 70 రెట్ల నుంచి 700 రెట్ల పుణ్యం లభిస్తుంది.
- దైవత్వం ఈ నెలలో నరక ద్వారాలను మూసి వేయిస్తారని, స్వర్గ ద్వారాలను తెరిచి ఉంచుతారని, సైతానులను బంధిస్తారని నమ్మకం.
- పేద, సాదలకు, అవసరార్థులకు, వితంతువులకు, అనాథలకు, బాటసారులకు ఎక్కువగా సాయం, దాతృత్వం చూపబడుతుంది. సంపద వృద్ధి చెందుతుంది.

బాలిక మృతి కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

బొండపల్లి: నిర్లక్ష్యంగా లారీని నడిపి బాలిక మృతికి కారణమైన ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జిల్లా కేంద్రంలోని ఎస్టీ,ఎస్సీ అట్రాసిటి కోర్టు న్యాయమూర్తి షేక్ సికిందర్ బాషా గురువారం తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ఎస్సై రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన చలపతి దుర్గాప్రసాద్ 2017వ సంవత్సరంలో లారీ నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వస్తూ నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బాలికను ఢీకొనడంతో మృతి చెందింది. ఈ మేరకు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు నిచ్చారు.

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

కొత్తవలస: పోక్సో కేసులో ఇద్దరు నిందితులకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై బొడ్డు దేవి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17వ తేదీన మండలంలోని ఓ గ్రామంలో మైనర్లపై దెందేరు గ్రామానికి చెందిన బొబ్బిలి రాజేష్, దాలిబోయిన ఎర్నాయుడులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు 17వ తేదీన కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.ఈ కేసు విచారణ కోసం నిందితులను కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. దీంతో ఎస్.కోట సబ్ జైలు నిందితులను తరలించారు.

అప్రమత్తం కాకుంటే...ప్రాణ క్షయం

- 2022లో 3,393 కేసులు నమోదు
- 2023లో ఇప్పటి వరకు 670 కేసులు నమోదు
- నేడు ప్రపంచ క్షయనివారణ దినోత్సవం


కఫం పరీక్ష చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్



క్షయ వ్యాధి నివారణ తెలిపే బ్యానర్

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధి ఒకప్పుడు సమాజాన్ని పట్టిపీడించేది. ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపట్టడం వల్ల వ్యాధి కాలక్రమేణా అదుపులోకి వస్తోంది. త్వరగా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. క్షయ వ్యాధి పట్ల అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమని చెబుతున్నారు. వ్యాధిని త్వరగా గుర్తించి మందులు పూర్తిస్థాయిలో వాడితే పూర్తిగా నయమవుతుందని స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం ప్రపంచ క్షయనివారణ దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

ఎడతెరిపి లేకుండా దగ్గు, జ్వరం రావడం, ఆకలి మందగించడం, వికారంగా ఉండడం, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం క్షయవ్యాధి లక్షణాలు. చుబర్ క్యూలోసిస్ అనే మైక్రో బాక్టీరియా వల్ల క్షయ వ్యాధి వ్యాప్తి చెందితుంది. రోగి దగ్గినప్పుడు వచ్చే ఉమ్మి తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధిలో రకాలు

క్షయ వ్యాధి వెంట్రుకలు, గోళ్లకు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా వస్తుంది. 35 నుంచి 50 ఏళ్ల వయసు గల వ్యక్తుల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఊపిరితిత్తులకు సంబంధించి (పలమనరీ టీబీ) అధికశాతం మంది వ్యాధి బారిన పడుతున్నారు. గర్భాశయం, చర్మం, ఎముకలు, కళ్లకు వచ్చే క్షయ వ్యాధిని (ఎక్స్‌ట్రా పలమనరీ టీబీ) అంటారు. ఈ వ్యాధి ఎక్కువగా హెచ్ఐవీ, మధుమేహం, రక్తహీనత, పౌష్టికాహారం లోపం ఉన్న వారికి వచ్చే ఆస్కారం ఉంది.

వ్యాధి రాకుండా జాగ్రత్తలు

క్షయ వ్యాధిరాకుండా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం, సురక్షితం కాని లైంగిక సంబంధాల వంటి వాటికి దూరంగా ఉండాలి. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులను పూర్తి కాలం పాటు వాడాలి. సాధారణ వ్యాధికి 6 నెలల పాటు, మధ్యలో మానివేసి తిరిగి ప్రారంభిస్తే 8 నెలల పాటు, మొండి వ్యాధికి అయితే రెండేళ్ల పాటు మందులు వాడాలి. అలా కాకుండా మందులను మధ్యలో మానివేస్తే రోగ నిరోధక శక్తి క్షీణించి మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

2019 నుంచి 2023 మార్చి 23 వరకు చేసిన క్షయ పరీక్షలు, నిర్ధారణ అయిన రోగుల వివరాలు		
సంవత్సరం	క్షయ రోగులు	మొండిక్షయ
2019	4800	143
2020	3100	77
2021	2800	124
2022	3393	95
2023 మార్చినాటికి		676

జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలు

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న కఫం పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష చేసుకోవాలి. జిల్లాలో పరీక్ష కేంద్రాలు 34 ఉన్నాయి. అలాగే 14 టీబీ యూనిట్లు ఉన్నాయి. వాటిలో ఏ కేంద్రానికి వెళ్లినా ఉచితంగా పరీక్ష చేసి మందులు అందజేస్తారు.

వ్యాధిపై అవగాహన

క్షయ వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పరీక్షలు చేస్తూ వ్యాప్తిని తగ్గిస్తున్నాం. 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే సంకల్పంతో చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ రామేశ్వరి ప్రభు,
జిల్లా క్షయ నివారణ అధికారి

గౌరునాయుడికి పతంజలి పురస్కారం

- 29న ప్రదానం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పతంజలి సాంస్కృతిక వేదిక ప్రతినిధులు


పతంజలి పురస్కారగ్రహీత గౌరినాయుడు మాస్టారు

విజయనగరం పూల్‌బాగ్: ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు, అనేక పత్రికలకు సంపాదకుడిగా పనిచేసిన స్వర్గీయ కె.ఎన్.వై. పతంజలి పేరున ఏటా అందించే పురస్కారాన్ని ఈ ఏడాది ప్రఖ్యాత రచయిత గంటేడ గౌరునాయుడికి అంద జేయనున్నారు. ఈ మేరకు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేదిక ప్రతినిధుల కమిటీ గౌరునాయుడి పేరును సూచించిందని చెప్పారు. స్నేహ కళా సాహితీ సంస్థను స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవులు, కథకుల్ని తయారు చేసిన ఘనత గౌరునాయుడి మాస్టారికే దక్కుతుందని భీశెట్టి అన్నారు. వేదిక కార్యదర్శి ఎన్. కె.బాబు మాట్లాడుతూ పతంజలి పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రముఖ రచయితలు మోహన్, మహర్షి, దేవిప్రియ, సతీష్ చంద్ర, చింతకింది, అట్టాడ అప్పలనాయుడు, పప్పు అరుణ లకు అందచేశామని, 2023లో గంటేడ గౌరునాయుడికి అందజేయనుండడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 29న బుధవారం ఉదయం గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదానం కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు,పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, ఇప్పలవలస గోపీ, గురజాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుందరమైన కావ్యం 'సుందరకాండ'


సుందరకాండను ఆలపిస్తున్న శ్రీనివాస్‌స్వామి

విజయనగరం రూరల్: రామాయణంలో అత్యంత సుందరమైన కావ్యం సుందరకాండ అని హనుమత్ ఉపాసకులు పి.శ్రీనివాస్‌స్వామి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం శివారు సారిక సమీపంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి మహోత్సవంలో భాగంగా శ్రీనివాస్‌స్వామి సుందరకాండ కథాగాన సప్తావం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఎస్‌ఈబీ ఏఎస్పీ ఆస్మాఫర్హీన్


యువతకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ ఆస్మాఫర్హీన్

బొబ్బిలి రూరల్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఆస్మాఫర్హీన్ సూచించారు. మండలంలోని గోకుల్ విద్యాసంస్థలలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాలవ్యతిరేక అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, జీవితం నాశనమ వుతాయని, కుటుంబసభ్యులు దూరమవుతారని, అలాగే మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, తరలించడం, వాడడం చట్టరీత్యా నేరమని, వాటిపై ప్రభుత్వం కఠినచర్యలు చేపడుతుందని వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నా,కలిగి ఉన్నా, తరలిస్తున్నా టోల్‌ఫ్రీనంబర్14500కు ఫోన్ చేసి తమకు తెలియజేయాలని సూచించారు. ఈ సదస్సులో గోకుల్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హేమలత, సిబ్బందితో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 15 మంది డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (మ్యాథ్స్-1బి, జువాలజీ-1, హిస్టరీ-1పేపర్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25,835 మంది విద్యార్థులు హాజరు కాగా మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన 15 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్ఐఓ ఎం సత్యనారాయణ తెలిపారు. ఇంటర్‌మీడియట్ జనరల్ పరీక్షకు 21139 మంది హాజరు కావాల్సి ఉండగా, 20204 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 6431 మంది హాజరు కావాల్సి ఉండగా, 5631 మంది మాత్రమే హాజరయ్యారు. ఆర్ఐఓ నాలుగు పరీక్షా కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42 కేంద్రాలు, ఇతర అధికారులు 8 కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేశారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామంలో కుక్కలు దాడిచేయడంతో గ్రామానికి చెందిన తాడేల ఈశ్వరమ్మ గాయాల పాలైంది. గురువారం వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న ఆమెపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె కాలికి గాయం కావడాన్ని స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టిన అనంతరం ఆమెను ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జాతీయ రహదారిపై దుర్గగుడి సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మెదుగు పంచాయతీ పర్తాపురం గ్రామానికి చెందిన గన్నేలబోయిన గుండు, సన్యాసి, చంద్రమ్మ, సోను అనే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బుధవారం ఆటోలో పాచిపెంటలో జరిగిన నూకాలమ్మ జాతరకు వచ్చి తిరిగి పర్తాపురం వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 సహాయంతో వారిని సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో గన్నేలబోయిన గుండు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200